వేడుకలకు సమాయత్తం

వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 26 గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డి పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ రిహార్సల్స్‌లో పాల్గొని జరుగుతున్న ఏర్పాట్లు, పోలీసుల పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు సిబ్బంది పాల్గొన్నారు. –వికారాబాద్, జనవరి 25

రిపబ్లిక్ డేకు సిద్ధమైన పోలీస్ శాఖ స్టాల్

కూరగాయల నారుకు

భలే డిమాండ్

- నర్సరీల్లో మొక్కల పెంపకంపై రైతుల ఆసక్తి
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న పట్టణ, పల్లెవాసులు
- ఉపాధి పొందుతున్న పలువురు నిరుద్యోగులు

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 25 : రంగారెడ్డి జిల్లాలో కూరగాయల నర్సరీలకు భలే డిమాండ్ ఉన్నది. ఇప్పటికే పలువురు నర్సరీలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమయ్యే అన్ని రకాల కూరగాయలు, పండ్ల మొక్కలను విక్రయిస్తున్నారు. రూపాయికో మొక్కను చొప్పున అమ్ముతుండడంతో రూ. లక్షల్లో విక్రయాలు సాగుతున్నాయి. గతంలో కూరగాయల సాగుకు పంట భూముల్లో నారు పోసి, అవి పెద్దగా మారిన తర్వాత విక్రయించేవారు. ఇటీవల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ఇండ్లు, పరిసర ప్రాంతాల్లో కుండీలను ఏర్పాటు చేసి కూరగాయలను సాగు చేస్తున్నారు. దీంతో వారికి కావాల్సిన మొక్కల కోసం నర్సరీలకు వెళ్లి కొనుగోలు చేస్తుండడంతో అక్కడ పెంచుతున్న మొక్కలను డిమాండ్ పెరుగుతున్నది.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, కందుకూరు, మహేశ్వరం, షాబాద్, షాద్‌నగర్, చేవెళ్ల తదితర మండలాల్లోని పలువురు రైతులు, యువకులు నర్సరీలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఎకరా భూమిలో ఇరిగేషన్ ద్వారా నర్సరీలను ఏర్పాటు చేసి హైబ్రిడ్ రకానికి చెందిన టమాట, బీరకాయ, వంకాయ, గోబీ పువ్వు, క్యాబేజీ, మిరపతోపాటు పండ్లు, పూల మొక్కలను సాగు చేస్తున్నారు. ఇందుకోసం మినీఫారంలు, షెడ్లను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ కుండీల్లో వివిధ రకాల విత్తనాలు వేసి మొక్కలను పెంచుతున్నారు. కొబ్బరి పీచుతోపాటు నల్లమల్లి, సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకొంటున్నారు. విత్తనాలు నాటిన పది రోజుల్లోనే మొలక వస్తున్నది. ప్రత్యేక సిబ్బందిని నియమించుకుని వారికి కూడా ఉపాధి కల్పిస్తున్నారు.



ప్రైవేట్ నర్సరీలో అందుబాటులో ఉన్న కూరగాయల నారు

రైతులకు అందుబాటులో వివిధ మొక్కలు

ప్రతి మండలంలోనూ రెండు నుంచి 10 వరకు నర్సరీలను ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన మొక్కలను విక్రయిస్తున్నారు. రైతులు సాగు చేసే వంకాయ, టమాట, మిరప, బెండకాయ, క్యాబేజీతోపాటు పలు రకాల పండ్లు, పూలమొక్కలను నర్సరీల్లో అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో రైతుల ఈ నారుతో పంటలు సాగు చేసుకొని అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

నాణ్యమైన నారును విక్రయిస్తున్నారు

గతంలో కూరగాయలు సాగు చేయాలంటే ముందుగా విత్తనాలు కొనుగోలు చేసి నారుపోసి పంటలు సాగుచేసేవాళ్లం. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హైబ్రిడ్ రకం కూరగాయల నారు ప్రైవేట్ నర్సరీల్లో లభిస్తున్నది. రూపాయి నుంచి రెండు రూపాయల వరకు నాణ్యమైన నారును విక్రయిస్తున్నారు. ఈ నారుతో ఎంతో దిగుబడి వస్తున్నది. **- మొద్దు అంజిరెడ్డి, ఉత్తమ రైతు**

కూరగాయల నారును పెంచేందుకు బాక్సుల్లో ఎరువు, మట్టిని నింపుతున్న కూలీలు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వరం

పీఎం విశ్వకర్మ పథకం

తెలంగాణ కాన్ఫిడిరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ ఆధ్వర్యంలో ఓరియేంటేషన్ సదస్సు

సదస్సుకు హాజరైన ప్రముఖులు

సిటీబ్యూరో, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సాయంతో కూడిన ప్రోత్సాహం, నైపుణ్యాల్లో ఉచిత శిక్షణ అందించేందుకు పీఎం విశ్వకర్మ పథకం ఎంతో తోడ్పడుతుందని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ అన్నారు. తెలంగాణ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ స్కీంపై ఓరియేంటేషన్ సదస్సు గురువారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జరిగింది. దీనికి ఎంఎస్ఎంఈ, పలు చేతి వృత్తిదారులు, కో–వే ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి స్కీంలో పేర్కొన్న వృత్తులకు ప్రత్యేక శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని పెంపొందిస్తారని, శిక్షణ కాలానికి ప్రతిరోజూ రూ.500 స్టైఫండ్, ఉచిత వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. ఆధార్, ఆధార్ అనుసంధానం చేయబడిన మొబైల్ నంబర్, రేషన్ కార్డు ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్‌లోనే ఎంపిక పూర్తవుతుందన్నారు. అదేవిధంగా కామన్ సర్వీస్ సెంటర్‌లోనూ ఉచితంగానే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి మూడు దశల్లో శిక్షణ ఉంటుందని.. బ్యాంక్ లోన్ ఫెసిలిటీ, సర్టిఫికెట్ వంటివి అందజేస్తారని తెలిపారు. దరఖాస్తు విధానం, కావాల్సిన దరఖాస్తులు, ఈ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలపై ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఓరియేంటేషన్ సదస్సుకు 150కి మందిపైగా హాజరు కాగా, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తోపాటు కోర్సు వివరాలు, స్కీం విధి విధానాలపై చేతివృత్తిదారులకు సలహాలిచ్చారు. కులవృత్తులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం ఫలాలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని కో–వే తెలంగాణ చాప్టర్ ప్రెసిడెంట్ చేతనజైన్ అన్నారు. కార్యక్రమంలో జీఎం–డీఐసీ ప్రీతీపవన్‌కుమార్, ఎంఎస్ఎంఈ అధికారులు శ్రీనివాసరావు, కో–వే ఇండియా సలహాదారు కరుణాగోపాల్, కో–వే వైస్ ప్రెసిడెంట్ కల్పనారావు, సెక్రటరీ నీరజాగోదావర్తి, కోశాధికారి నిషాఅగర్వాల్, జాయింట్ సెక్రటరీ అనురాధ కారటీ, నాయీ బ్రాహ్మణ సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్లేశ్, గోల్డ్ స్మిత్ అసోసియేషన్ పిట్లంపల్లి రామలింగంచారి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

స్వర్ణకంటి కల్యాణి (ఫైల్)

కడ్తాల్, జనవరి 25: ఇంటి నుంచి బయటకెళ్లిన యువతి అదృశ్యమైనది. ఈ ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండలంలోని మక్తమాదారం గ్రామానికి చెం దిన స్వర్ణకంటి భావమ్మ, నర్సింహ దంపతులకు కల్యాణి (19) అనే కుమార్తె ఉన్నది. ఈ నెల 11 తేదీన ఉదయం 9 గం ట ల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకెళ్లి తిరిగి రా లేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఆమె కోసం బంధువులు, తెలిసిన వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చేవెళ్ల రూరల్, జనవరి 25 : పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేవెళ్ల మండలంలోని తంగడిపల్లిలో పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం చేవెళ్ల పోలీసులు స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి డబ్బు, పేకలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొడంగల్ అభివృద్ధికి

రూ.300 కోట్లతో ప్రతిపాదనలు

'కడా' ప్రత్యేకాధికారికి అందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి మున్సిపల్ అభివృద్ధి ప్రణాళికను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఈ నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా : వెంకట్‌రెడ్డి

కొడంగల్, జనవరి 25 : కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి రూ. 300 కోట్లతో రూపొందించిన అభివృద్ధి ప్రణాళికను గురువారం మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిలతో కలిసి మున్సిపల్ కమిషనర్ 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కడా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో రానున్న ఐదేండ్లకు సంబంధించి ప్రజాప్రతినిధులు, అధికారులు రూ.300 కోట్లతో రూపొందించిన అభివృద్ధి ప్రణాళికను అందించారని.. ఆ నివేదికను వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆ నివేదికలో మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన తాగునీరు, విద్యుత్తు, బీటీ, సీసీ రోడ్లు, పార్కులు, స్కూళ్లు, అంగన్‌వాడీలు, వైకుంఠధామం, బస్తీ దవాఖాన, పబ్లిక్ కమ్యూనిటీ మరుగుదొడ్లు, పట్టణ సుందరీకరణతోపాటు కొడంగల్‌లో వ్యవసాయ, స్కిల్ డెవలప్‌మెంట్, ఆయుష్, మహిళా డిగ్రీ కళాశాలలు, మిల్లెట్ రిసెర్చ్, మిల్క్ చిల్లింగ్ సెంటర్లు, బస్టాండ్ అధునీకరణ, ఫారెస్ట్ పార్కు, పాత భవనాల కూల్చివేత వంటి అంశాలున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని ఆయా శాఖల వారీగా అభివృద్ధి ప్రణాళికలు కూడా సిద్ధమవుతున్న పేర్కొన్నారు. పట్టణంలోని మహాలక్ష్మీ వేంకటేశ్వరాలయాభివృద్ధికి సంబంధించి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ప్రణాళిక ఏర్పాటు కానున్నదన్నారు. సౌకర్యాల మేరకు అభివృద్ధిని సాధించే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు రమేశ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో బ్యాగులు తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసుల తనిఖీలు

వికారాబాద్, జనవరి 25 : గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, మార్కెట్లలో బాం బు, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారన్నారు. జిల్లా లో ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసు అధికారులు, డయల్ 100కు కాల్ చేసి తెలపాలన్నారు. తనిఖీల్లో ఆయా పీఎస్‌ల అధికారులు, సిబ్బంది, సంజీవయ్య, విఠల్, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఆది

బట్ల, జనవరి 25 : ఎట్టకేలకు ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు, కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు, బీజేపీకి చెందిన ఒక్కరు చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక, వైస్ చైర్‌పర్సన్ కళమ్మపై అవిశ్వాసం పెట్టాలని తీర్మానం చేసి ఆ ప్రతిని కలెక్టర్‌కు 20 రోజుల క్రితం అందించారు. కాగా గురువారం కలెక్టర్ శశాంక ఫిబ్రవరి 9న ఉదయం 10:30 గంటలకు ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్, 12 గంటలకు వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ఏర్పాటు చేయాలని నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తోపాటు మరో 13 మంది కౌన్సిలర్లకు విడివిడిగా నోటీసులు జారీ చేశారు.

వచ్చే నెల 9న ఆదిబట్ల మున్సిపల్

చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

15 మంది కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేసిన రంగారెడ్డి కలెక్టర్

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశించిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి .. తమ పార్టీకే చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్తికపై అవిశ్వాసం పెట్టాలని మిగతా కౌన్సిలర్లను ఉసిగొల్పారు. ఇందుకోసం కొంతమంది సభ్యులను విహారయాత్రలకు తీసుకెళ్లాడు. కాగా అతడితోపాటు కాంగ్రెస్ పార్టీకే చెందిన యాదగిరి, అర్చన, బీఆర్ఎస్ పార్టీకి చెందిన వైస్ చైర్‌పర్సన్ కళమ్మ సైతం చైర్మన్ రేసులో ఉన్నట్లు సమాచారం. కాగా ఫిబ్రవరి 9న చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఎవ్వరినీ వరిస్తాయో తెలియనున్నది.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

- పారదర్శకంగా రూపొందించాలి
- రోల్ అబ్జర్వర్ జ్యోతీబుద్ధ ప్రకాశ్

సమావేశంలో మాట్లాడుతున్న రోల్ అబ్జర్వర్ జ్యోతీబుద్ధ ప్రకాశ్

వికారాబాద్, జనవరి 25 : బీఎల్‌వోలు, బీఎల్ఏల సహకారంతో తప్పులేని.. పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలని రోల్ అబ్జర్వర్ జ్యోతీబుద్ధ ప్రకాశ్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి ఓటరు జాబి తా రూపకల్పనపై అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా ఎంతో ముఖ్యమన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ నాయకుల సహకారంతో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకొని, వారి సహకారంతో బీఎల్‌వోల ద్వారా పక్కాగా ఓటరు జాబితాను రూపొందించాలని సూచించారు. డూప్లికేట్ ఓటర్లు, చనిపోయిన వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. ప్రతి బీఎల్‌వో తన వద్ద ఫామ్–6, 7, 8 అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తన వద్ద ఉన్న ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓటర్లు, చనిపోయిన వారు లేనట్లు ప్రతి పేజీపై సంతకం చేయాలన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలతో ఓటరు జాబితా రూపకల్పనలో మార్పులు, చేర్పులు తదితర అంశాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా లో ఓటరు ప్రక్రియ చాలా బా గుందని ఆయన కితాబు ఇచ్చారు.

ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. తుది ఓటరు జాబితాను ఫిబ్రవరి 8న ప్రకటించనున్న సందర్భంగా అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు తొలగింపులు అన్నింటిని ఈ నెల వరకు పూర్తి చేసి పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందిస్తామన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని కళాశాలల్లో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి యువతీయువకులందరినీ ఓటరుగా నమోదు చేశామని గుర్తు చేశారు. సమ్మర్ స్పెషల్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను ఈ నెలలోపు పరిష్కరించి, రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు స్పష్టమైన ఓటరు జాబితాను రూపొందిస్తామన్నారు. సమావేశంలో వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూరు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, విజయకుమారి, శ్రీనివాసరావుతో పాటు నియోజకవర్గాల ఏఈఆర్‌వోలు, వివిధ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నల్లచట్టాలను రద్దు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

ఆమనగల్లు, జనవరి 25 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్లచట్టాలను రద్దు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం వెంటనే నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు జంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకుడు వెంకటయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు అరుణ్‌కుమార్, వామపక్ష, ప్రజాతంత్రవాదులు, రైతులు పాల్గొన్నారు.

అమ్మఒడి యాప్‌ను వినియోగించాలి

రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, జనవరి 25 : అమ్మఒడి యాప్‌ను ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో వినియోగించాలని రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వోలో అమ్మఒడి యాప్‌ను క్షేత్రస్థాయిలో ఏ విధంగా ఉపయోగించాలనే అంశంపై డివిజన్ పరిధిలోని ఏఎన్ఎంలతో ఆయన సమీక్ష నిర్వహించారు. అమ్మఒడి యాప్ ను క్షేత్రస్థాయిలో వినియోగించడంతోపాటు అందులో సమాచారాన్ని పొందుపర్చాలని.. వచ్చే సందేశాలను గమనించాలని ఆయన సూచించారు. గర్భిణులు, బాలింతలతో ఆరోగ్య సమస్యలపై చర్చించినప్పుడు వారికి ఏ విధంగా సాంత్వన చేకూర్చొచ్చో.. దానికి సంబంధించిన శిక్షణా కార్యక్రమం డివిజన్ పరిధిలోని 58మంది ఏఎన్ఎంలకు ఇప్పటికే పూర్తైందన్నారు. ఈ శిక్షణను ప్రతి 15 రోజులకొకసారి ఏఎన్ఎంలకు దూరవిద్య, యాప్ ద్వారా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, సంతోష, ఆరోగ్య వైద్యావిద్య విస్తరణాధికారి సుదర్శన్, డాక్టర్ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యమివ్వాలి

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 2024–25లో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో అభివృద్ధికి అధిక ప్రాధాన్యమివ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఆమె రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్తు దీపాలు, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీఠ వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, సిబ్బంది పాల్గొన్నారు. **–ఇబ్రహీంపట్నం, జనవరి 25**